9

సాక్షి జోగులాంబ గద్వాల

గురువారం । 7 । నవంబర్ । 2024

గరిష్ఠం/కనిష్ఠం
34.3/17.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ.. రాత్రి చలి ప్రభావం కనిపిస్తుంది.



స్వర్ణభూషితుడు.. కురుమూర్తిరాయుడు

అమ్మాపురంలోని కాంచనగుహలో కొలువుదీరిన శ్రీకురుమూర్తిస్వామికి ముక్కెర వంశీయులు బహూకరించిన కిరీటం, హస్తాలు, పాదుకలు, కోరమీసాలు, కెంపు, ముత్యాలహారం, కనకహారాలు తదితర ఆభరణాలను బుధవారం అలంకరించారు. స్వర్ణ ఆభరణాల అలంకరణతో కాంచనగుహలోని కురుమూర్తిరాయుడు దేదీప్యమానంగా వెలుగొందారు.

– చిన్నచింతకుంట



వైభవంగా అలంకారోత్సవం

- స్వర్ణకాంతుల్లో కాంచనగుహ
- ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- స్వామివారికి పట్టువస్త్రాలు అందజేసిన అమరచింత చేనేతలు
- అశ్వవాహనంపై స్వామివారి ఊరేగింపు

– వివరాలు 10లో..

న్యూస్‌రీల్

'పాగుంట' ఆలయ హుండీ ఆదాయం రూ.9.72లక్షలు



కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం అధికారులు లెక్కించారు. 13 నెలల 15 రోజులకు గాను రూ.9.72లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరమ్మ తెలిపారు.

తీర్థయాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్తీక మాసం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని పది డిపోల నుంచి తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయ్యప్పస్వాముల కోసం శబరిమలై క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. బస్సు బుక్ చేస్తే గురుస్వామికి సీటు ఉచితమని, ఒకటి కంటే ఎక్కువ బుక్ చేస్తే.. మిగతా బస్సులకు రోజుకు రూ.300 చొప్పున గురుస్వామికి కమిషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీశైలం క్షేత్రానికి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట మీదుగా అరగంటకో బస్సు నడపనున్నట్లు వివరించారు. ఈ రూట్‌లో కొత్తగా ఐదు డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టామని తెలిపారు. డీలక్స్ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని, www.tgsrtcbus.in లో బుక్ చేసుకోవచ్చని సూచించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ నెల 13న సాయంత్రం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, షాద్‌నగర్ బస్టాండ్ల నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. కురుమూర్తి జాతర కోసం ఈనెల 8న ఉద్దాల ఉత్సవం రోజు భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి ఆరాంఘర్ మీదుగా నాలుగు బస్సులు నడపనున్నామని, ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం ఉందని ఆర్ఎం వివరించారు.

రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలి



గద్వాలటౌన్: క్రీడల్లో గెలుపు ఓటముల కంటే క్రీడా స్ఫూర్తి ప్రధానమని.. రాష్ట్రస్థాయిలోను సత్తా చాటాలని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి బీఎస్ ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బుధవారం ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్–17 బాలుర, బాలికల క్రికెట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు రెండు వందల మంది విద్యార్థులు ఎంపిక పోటీలకు హాజరయ్యారు. పీడీ కృష్ణయ్య, కోచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాకీ జట్టు ఎంపిక

స్థానిక సోమనాద్రి స్టేడియంలో అండర్–14 బాలికల హాకీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జితేందర్ హాకీ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన క్రీడాకారులతో పోటీలు నిర్వహించి, రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఇదిలాఉండగా, పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్, హైజంప్ తదితర విభాగాలలో 13 మంది బాల, బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా బీసన్న, సతీష్‌కుమార్ అభినందించారు.

కులగణనలో భాగస్వామ్యం కావాలి

గద్వాల అర్బన్: సమగ్ర కుల గణనలో కాంగ్రెస్ లాగా బీఆర్ఎస్, బీజేపీలు కూడా భాగస్వామ్యం కావాలని, దీనిని ఒక యజ్ఞంలాగా ఉద్యమస్ఫూర్తితో కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవనంలో బీసీ కుల గణన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణనలో బీసీలందరు భాగస్వామ్యం కావాలని, ఈ సర్వేలో కులం పేరు చెప్పడంతో బీసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, రాజకీయ అధికారం వస్తోందన్నారు. బీసీలోని 136 కులాలు స్వచ్ఛందంగా పాల్గొని తమ కులం పేరు తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలరాజు గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ పాల్గొన్నారు.



ఎక్కడి పనులు అక్కడే!

మున్సిపాలిటీల్లో నిలిచిన అభివృద్ధి పనులు



అలంపూర్‌లో అసంపూర్తిగా నిలిచిన సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణం

- కలగానే పుర నూతన కార్యాలయాల నిర్మాణం
- ముందుకు కదలని సుందరీకరణ పనులు
- అంతర్గత రోడ్లు అధ్వానం.. ప్రజలకు తప్పని తిప్పలు

అలంపూర్: మున్సిపాలిటీల రూపురేఖలు మార్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ యార్డులు.. నూతన పుర కార్యాలయాల నిర్మాణం.. సీసీ రోడ్లు.. డివైడర్లు.. సుందరీకరణ పనులను ప్రారంభించింది. అంతవరకు బాగానే ఉన్నా.. కాలక్రమేణా రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు చోటుచేసుకుంది. కొత్త ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. డివైడర్లు, సీసీ రోడ్లు, సుందరీకరణ పనుల కోసం రోడ్లను తవ్వి వదిలేయడంతో పట్టణ వాసుల పరిస్థితి పెనంపై పొయ్యిలో పడ్డ చందంగా మారింది. అసంపూర్తి పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కలగానే కొత్త భవనాలు

గ్రామ పంచాయతీ స్థాయిని దాటి మున్సిపాలిటీలుగా మారినా కార్యాలయ నిర్మాణాలు కలగానే మిగిలాయి. అలంపూర్‌లో రూ.1.50 కోట్లతో మున్సిపల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. కొత్త భవన నిర్మాణానికి స్థలం సేకరించారు. ఆ తర్వాత నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. వడ్డేపల్లి మున్సిపాలిటీలో రూ.1.50 కోట్లతో భవన నిర్మాణ పనులు ప్రారంభించగా.. పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టగా.. ఏడాది నుంచి పనులు ముందుకు కదల్లేదు. అయిజలో భవన నిర్మాణానికి రూ.2 కోట్లు కేటాయించగా.. స్థల సమస్య, నిధుల కొరత కారణంగా నిర్మాణం ప్రారంభం కాలేదు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు.. పునాదులకే పరిమితం

ఇక సమీకృత మార్కెట్ల నిర్మాణ విషయానికి వస్తే అలంపూర్‌లో 2 ఎకరాల్లో రూ.2కోట్లతో స్లాబ్, పిల్లర్ల వరకు మాత్రమే పనులు చేరుకున్నాయి. వడ్డేపల్లిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎకరా స్థలంలో రూ.2కోట్లతో ప్రారంభించారు. స్లాబ్, పిల్లర్లు నిర్మించి వదిలేశారు. నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే నిలిపివేశారు. అయిజలో సమీకృత మార్కెట్ యార్డుల నిర్మాణం పూర్తి చేశారు. ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉన్నప్పటికీ నిధుల కొరత కారణంగా పూర్తికావడం లేదు. కొన్ని పనులు మిగిలి ఉండటంతో ఇది అందుబాటులోకి రాలేదు. దీంతో వ్యాపారులు రోడ్ల పక్కనే దుకాణాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ప్రభుత్వం దృష్టి సారించాలి



గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీల అభివృద్ధికి జిల్లాకు రూ.125 కోట్లు మంజూరు పాలన అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం సగం మేరకు పనులు పూర్తి చేశారు. మిగిలిన పనులు చేయడానికి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చొరవ చూపి నిధులు విడుదల చేయాలి. మున్సిపల్ పాలక కౌన్సిల్ ముగియడానికి మూడు నెలలు మాత్రమే ఉంది. ఈ లోపు నిధులు మంజూరు చేస్తే పనులు వేగవంతం, పూర్తి చేసేందుకు వీలుంటుంది.

– మనోర, మున్సిపల్ చైర్‌పర్సన్, అలంపూర్

నిధుల జాడేదీ?

2023 జూన్ 29వ తేదీన జిల్లాకు గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేక అభివృద్ధి కింద రూ.152.30 కోట్లు మంజూరయ్యాయి. గద్వాల మున్సిపాలిటీకి రూ 50 కోట్లు, అయిజకు రూ. 25 కోట్లు, వడ్డేపల్లికి రూ. 25 కోట్లు, అలంపూర్‌కి రూ. 25 కోట్లు మంజూరు చేస్తూ పాలన అనుమతులు వచ్చాయి. నిధులు విడుదల చేస్తూ జీఓ జారీ చేసిన తర్వాత ఎన్నికలు రావడంతో ఆ తర్వాత నిధులకు సంబంధించి ఎలాంటి జాడా లేకుండాపోయింది. ఈ నిధులు వస్తే మున్సిపాలిటీల్లోని అంతర్గత రోడ్ల నిర్మాణాలతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడానికి అన్ని మున్సిపాలిటీల్లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిధుల గురించి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో నిధుల రాకపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏడాదిగా నిలిచిన విస్తరణ పనులు

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో రూ. 35 కోట్ల వ్యయంతో సుందరీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. రోడ్ల విస్తరణ, డివైడర్ నిర్మాణాలు మధ్యలోనే నిలిచాయి. అయిజ, గద్వాల మున్సిపాలిటీల్లో రోడ్ల విస్తరణ డివైడర్ నిర్మాణం పూర్తి చేశారు. అలంపూర్, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో సుందరీకరణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా తయారయ్యాయి.

- వడ్డేపల్లి మున్సిపాలిటీలో సుందరీకరణలో భాగంగా రూ. 3.50 కోట్లతో రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. ఇక్కడ రోడ్డు విస్తరణ చేసి కంకర వేసి వదిలేశారు. పుర ముఖ ద్వారాల వద్దనే చేపట్టిన సుందరీకరణ పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఏడాదిగా పనుల్లో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రతి రోజు రాకపోకలు సాగించాల్సిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటితోపాటు సెంట్రల్ లైటింగ్ పనులు, పచ్చదనం పెంపొందించే పనులు ఆరంభానికి నోచుకోలేకపోతున్నాయి.
- అయిజకి కేటాయించిన రూ.15 కోట్లలో రూ.6 కోట్లతో రోడ్ల విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. జిల్లా కేంద్రమైన గద్వాలలో రూ.2.40 కోట్లతో డివైడర్ నిర్మాణ పనులు చేపట్టారు. కొత్తగా ఆవిర్భవించిన అలంపూర్ మున్సిపాలిటీలో సుందరీకరణలో భాగంగా రూ.3.50 కోట్లతో రోడ్డు విస్తరణ, డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించారు. సుందరీకరణ పనుల్లో రోడ్డు విస్తరణ వద్దనే నిలిచిపోయాయి.



అలంపూర్‌లో మధ్యలో నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

సర్వేలో పొరపాట్లకు తావివ్వొద్దు



గద్వాలలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న సర్వే బృందానికి సలహాలు ఇస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

- మూడు రోజుల్లో ఇళ్ల లెక్కింపు పూర్తి ..
- కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల/ధరూరు: సమగ్ర సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం సంతోష్ సర్వే అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గద్వాల పట్టణంలో పలు కాలనీలు, ధరూరులోని బీసీ కాలనీ, సబ్ స్టేషన్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే ప్రక్రియలో ఒక్క కుటుంబం, ఇళ్లు మిస్‌కాకుండా సర్వే నిర్వహించాలన్నారు. ఈ నెల 6,7,8 తేదీలలో మూడు రోజుల్లో ఇళ్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ వివరాల సేకరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీలతో పాటు ఉదయం తమ విధులు నిర్వహించుకున్న అనంతరం ఎజ్జీటీలు కూడా మధ్యాహ్నం నుంచి సర్వేలో పాల్గొంటున్నారన్నారు. సర్వే బృందానికి నిర్ణీత సమాచారాన్ని అందజేస్తూ జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతానికి అన్ని వర్గాల వారు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ప్రత్యేక అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

అయిజ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వేను అధికారులు, ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని ఉత్తనూరు, ఉప్పల గ్రామాల్లో నిర్వహించిన కుటుంబ సమగ్ర సర్వేను పరిశీలించారు. ఒకే ఇంట్లో ఇద్దరు కంటే ఎక్కువ అన్నదమ్ములు నివసిస్తూ..వారు వేర్వేరుగా వంట చేసుకుంటుంటే వారి వివరాలను విడివిడిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు పాటుపడాలి

ఎర్రవల్లి: బాలల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా జడ్జి గంట కవిత అన్నారు. బుధవారం మండల పరిధిలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ.. బాలబాలికల కోసం కల్పించిన హక్కులను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తల్లిదండ్రులకు అసలైన సంపద పిల్లలే కాబట్టి జాగ్రత్తగా చదివించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండని వారికి పెళ్లి చేసి బాల్య వివాహం జరిపిస్తే రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందన్నారు. ఆపదలో ఉన్న బాల, బాలికలు టోల్‌ఫ్రీ నెంబర్ 1098కి కాల్ చేసి సహాయం పొందవచ్చునని తెలిపారు.

108లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల క్రైం: 108 అత్యవసర వాహనాల్లో పని చేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రోగాం అధికారి రవికుమార్, రత్నమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్ హెల్త్ సర్వీసు సంస్థలో ఈఎంటీ విభాగంలో పని చేయుటకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీన జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని 108 కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు ఉదయం 10గంటలోగా హాజరు కావాల్సిందిగా తెలిపారు.

ఒంటిపూట.. చదువు సాగేదెట్టా?

ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వే విధులు

- మధ్యాహ్నం వరకే కొనసాగుతున్న ప్రభుత్వ బడులు
- విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతుందని విద్యావేత్తల ఆందోళన
- ఒకరిద్దరు టీచర్లతోనైనా పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్

ఉదయం మహబూబ్‌నగర్ టీచర్స్ కాలనీ పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ధాక్యానాయక్



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఉపాధ్యాయుడి పేరు ధాక్యానాయక్. వయసు 58 ఏళ్లు. జిల్లా కేంద్రంలోని టీచర్స్‌కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఉదయం పాఠశాలలో విద్యార్థులకు తరగతులు బోధించి.. మధ్యాహ్నం సర్వేలో పాల్గొన్నారు. 12:30 గంటలకు పాఠశాలను మూసివేయడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లారు. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు పూర్తిగా, ప్రాథమికోన్నత పాఠశాలలు కొన్ని మధ్యాహ్నం వరకే కొనసాగుతున్నాయి.



మధ్యాహ్నం సర్వేలో భాగంగా ఇంటికి స్టిక్కర్లు అతికిస్తున్న ధాక్యానాయక్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సాధారణంగా వేసవి కాలం ప్రారంభంలో నెలరోజుల పాటు ఒంటిపూట బడులను నిర్వహిస్తారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పుణ్యమా అని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒంటి పూటే కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం నుంచి ఉపాధ్యాయులు సర్వే విధులకు వెళ్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను ఒంటిపూట నిర్వహిస్తుండటంతో ప్రాథమిక విద్య కుంటుపడుతుందని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఉదయం బడి.. మధ్యాహ్నం సర్వే

సర్వే జరిగినన్ని రోజులు ఉపాధ్యాయులు ఉదయం 9:05 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం 2 గంటల నుంచి సాయంత్రం వరకు ఇంటింటి సర్వే చేపడుతున్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక పాఠశాలలు బుధవారం మూతపడటంతో విద్యార్థులు ఇంటి ముఖం పట్టారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే ఎలా ఉన్నప్పటికీ.. గతంలో ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలను మధ్యాహ్నమే మూసి వేసి, ఒంటిపూట బడులను నిర్వహించడాన్ని ఇటు విద్యార్థి సంఘాలు, అటు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విద్యార్థుల చదువుపై ప్రభావం చూపకుండా యథావిధిగా బడులను నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

4,740 మంది టీచర్లకు సర్వే విధులు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు 2,041కు పైగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న 4,740 మంది ఉపాధ్యాయులను సమగ్ర కుటుంబ సర్వేకు కేటాయించారు. వీరు పాఠశాలల నుంచి మధ్యాహ్నమే నేరుగా సర్వేకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే వయసు పైబడి, రిటైర్డ్‌మెంట్ అయ్యేందుకు సిద్ధంగా ఉన్న వారికి సైతం సర్వే విధులు కేటాయించారు. ఉన్నత పాఠశాలల్లో నెలరోజుల క్రితం విధుల్లో చేరిన జూనియర్లను సర్వే విధులకు కేటాయించకుండా, వయసు పైబడిన వారికి విధులు కేటాయించడంపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులు, గర్భిణులు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా, చాలా చోట్ల సర్వే విధులు కేటాయించని వారు కూడా పాఠశాలలను మూసివేసి వెళ్తున్నట్లు తెలుస్తోంది. సర్వే విధులు లేని వారు పాఠశాల నిర్వహించాల్సి ఉండగా.. మధ్యాహ్నమే పాఠశాలలను మూసివేసినట్లు తెలిసింది.

విద్యార్థులకు ఇబ్బందులు..

సర్వేకు ఉపాధ్యాయ కేటాయింపు.. మధ్యాహ్నం వరకే పాఠశాలల నిర్వహణతో విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు న్యాస్ (నేషనల్ అసిస్‌మెంట్ సర్వే)ను ప్రభుత్వం ఈ నెల 8న నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. చదువులో వెనుకబడిన వారి అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు త్రీ ఆర్స్ కార్యక్రమం ప్రస్తుతం కొనసాగుతోంది. అందుకు సైతం ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. కాగా, గ్రామీణస్థాయిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయంతో పాటు వివిధ కూలీ పనులకు వెళ్తుంటారు. వారు ఉదయం వెళ్లి, సాయంత్రం ఇంటికి వస్తారు. ఆ సమయంలో విద్యార్థులు పాఠశాలలో ఉండే వారు. ప్రస్తుతం మధ్యాహ్నమే విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఇళ్ల వద్ద పిల్లల బాగోగులు చూసే వారు లేకుండాపోతున్నారు. ఒంటిపూట బడి ఉంటే, విద్యార్థులు పాఠశాలకు రెగ్యులర్‌గా వచ్చే అవకాశాలు తగ్గుతాయని తెలుస్తోంది.



మహబూబ్‌నగర్ టీచర్స్ కాలనీ పాఠశాలను 12:30 గంటలకు మూసివేయడంతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

జిల్లా	ప్రాథమిక పాఠశాలలు	సర్వే విధులు నిర్వహిస్తున్న వారు
మహబూబ్‌నగర్	614	1,156
వనపర్తి	365	782
నాగర్‌కర్నూల్	566	1,450
నారాయణపేట	298	746
జోగులాంబ గద్వాల	198	606


విద్యావ్యవస్థ కుంటుపడే అవకాశం



రాష్ట్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియలో ఉపాధ్యాయులను వినియోగించడం వల్ల విద్యావ్యవస్థ కుంటుపడుతుంది. విద్యలో వెనకబడిన జిల్లాలో ఉపాధ్యాయులను సర్వే ప్రక్రియలో వినియోగించడం వల్ల విద్యార్థులు మరింత వెనకబాటుకు గురవుతారు. ఈప్రక్రియలో ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చి ఇతర శాఖల ఉద్యోగులను వినియోగించుకోవాలి.

– మధుసూదన్‌బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, గద్వాల

సర్వే విధులు లేని వారు బడుల్లో ఉండాలి..



సమగ్ర కుటుంబ సర్వే విధులు కేటాయించని ఉపాధ్యాయులు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండాలి. విధులు కేటాయించిన వారు సర్వేకు వెళ్లినా.. విధుల్లేని వారు పాఠశాలలను మూసివేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు. సర్వే విధులు కేటాయించిన వారు నిబంధనలు పాటించాలి.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

స్వర్ణకాంతుల్లో కాంచనగుహ

కనులపండువగా స్వామివారి అలంకారోత్సవం



ఆత్మకూర్‌లో ఆభరణాల ఊరేగింపు

- ఘనంగా కురుమతిరాయుడి ఆభరణాల ఊరేగింపు
- గ్రామగ్రామాన ఘన స్వాగతం
- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట/ఆత్మకూర్/మదనాపురం: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన ఘట్టమైన అలంకారోత్సవం బుధవారం చూడముచ్చటగా సాగింది. వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లోని ఎస్‌బీఐ లాకర్‌లో భద్రపర్చిన స్వామివారి ఆభరణాలను ప్రత్యేక బందోబస్తు నడుమ ఆలయానికి తీసుకొచ్చారు. గ్రామంలోని ముక్కెర వంశీయులు రాజ శ్రీరాంభూపాల్ ఇంట్లో ఆనవాయితీగా గంటన్నరపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన నంబి వంశస్తులు ఆభరణాలను తలపై పెట్టుకొని అంభోరు మధ్య కాలినడకన కురుమూర్తికొండకు చేర్చారు.

అర్చకులకు ఆభరణాల అప్పగింత

ఊరేగింపుగా తీసుకొచ్చిన ఆభరణాలను ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, అధికారులు స్వామివారికి కిరీటం, హస్తాలు, పాదుకలు, కోరమీసం, కెంపు, ముత్యాలహారం, కనకహారం తదితర ఆభరణాలను ప్రధాన అర్చకుడు వెంకటయ్యాలకు అందజేశారు. అనంతరం ఆయన స్వామివారి మూలవిగ్రహానికి అలంకరించారు. దీంతో కాంచనగుహ స్వర్ణకాంతులతో ధగధగలాడింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కురుమూర్తి స్వామి, పద్మావతి అమ్మవారి ఉత్సవ మూర్తులను అశ్వవాహనంపై ఊరేగించారు.



ఆభరణాలను అర్చకులకు అందజేస్తున్న అధికారులు



ఆభరణాల ఊరేగింపులో ఎమ్మెల్యేలు, కలెక్టరు ఆదర్శ్ సురభి

భారీ బందోబస్తు నడుమ..

ఆత్మకూర్ ఎస్‌బీఐలో భద్రపర్చిన స్వామివారి స్వర్ణాభరణాలకు మక్తల్, దేవరకద్ర ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, మాజీ ఎమ్మెల్యేలు సీతాదయాకర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం గాడి వంశానికి చెందిన గాడి లక్షణచారి ఆభరణాలను తలపై ఉంచుకొని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పరమేశ్వరస్వామి చెరువు వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో కురుమూర్తి కొండలకు తీసుకెళ్లారు. సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగరాజుగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి, చైర్‌పర్సన్ గాయత్రిరవియాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బంగారు శ్రీను, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తిస్వామికి అమరచింత పట్టువస్త్రాలు..

అమరచింత: ప్రత్యేక మగ్గంపై నిష్ఠతో 15 రోజుల పాటు నేసిన కురుమూర్తిస్వామి పట్టువస్త్రాలకు బుధవారం స్థానిక భక్త మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పద్మశాలి కులస్తులు భాజాభజంత్రీల నడుమ వీధుల్లో ఊరేగించి ఆత్మకూర్ ఎస్‌బీఐకు తీసుకెళ్లారు. పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజుగౌడ్ పాల్గొన్నారు. అమరచింత నుంచి ఆత్మకూర్ బ్యాంకు వరకు నామాల నరేశ్, ఆత్మకూర్ నుంచి అమ్మాపురం వరకు పారుపల్లి గోవర్ధన్, అమ్మాపురం నుంచి ఆలయం వరకు దోమ రవి దంపతులు పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి ఆలయ అర్చకులకు అందజేశారు. ప్రతి ఏడాది స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించడం అనాధిగా వస్తోందని పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవరకొండ లక్ష్మన్న తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, మేర్వ రాజు, క్యామ భాస్కర్, పద్మశాలి సంఘం అధ్యక్ష కార్యదర్శులు మహంకాళి విష్ణు, ప్రభాకర్, క్యామ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన అర్చకులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న అమరచింత పద్మశాలీలు

గ్రామగ్రామాన ఘన స్వాగతం..

ఆత్మకూరు నుంచి మదనాపురం మండలంలోని గోపన్‌పేటకు చేరుకున్న ఆభరణాలకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. భారీ బందోబస్తు నడుమ దుప్పల్లికి చేరుకోగానే గ్రామస్తులు శివసత్తుల పూనకాలు, మేళతాలతో గ్రామస్తులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆభరణాల ఊరేగింపును సాగనంపారు.

ఉల్లి ధరలు మళ్లీ పెరిగాయ్

- గరిష్టంగా రూ.3,600
- కనిష్టంగా రూ.1,600



దేవరకద్ర మార్కెట్లో అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లి బస్తాలు

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి పాయల బహిరంగ వేలంలో గత వారంతో పోల్చుకుంటే ధరలు మరింత పెరిగాయి. మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి రైతులు వానాకాలం సీజన్ కింద పండించిన కొత్త ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. స్థానిక వ్యాపారులతో పాటు బయట మార్కెట్ల నుంచి వ్యాపారులు రావడంతో వేలం పాటలు జోరుగా సాగాయి. ఉదయం పది గంటల నుంచి మార్కెట్లో ఉల్లి వ్యాపారం ప్రారంభమైంది. మార్కెట్‌కు దాదాపు 500 బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు పోటీపడి వేలంలో కొనుగోలు చేశారు.

గత వారం కన్నా పెరిగిన ధర

దేవరకద్ర మార్కెట్లో జరిగిన వేలంలో ఉల్లి క్వింటాల్ ధర గరిష్టంగా రూ.3600, కనిష్టంగా రూ.1600 వరకు లభించాయి. గత వారం గరిష్టం ధర కంటే రూ.800 అధికంగా వచ్చింది. కనిష్టంగా రూ.240 వరకు ఎక్కువ పలికింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45 కేజీల ఉల్లి బస్తా ధర గరిష్టంగా రూ. 1800, కనిష్టంగా రూ.800 వరకు విక్రయించారు. చిన్నసైజు ఉల్లి క్వింటాల్ ధర రూ.1200 పలికింది. బస్తా ధర రూ.600 లకు అమ్మకాలు సాగించారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

- హన్వాడకు చేరిన రిటైర్డ్ డీఈఓ పాదయాత్ర

హన్వాడ: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని రిటైర్డ్ డీఈఓ విజయకుమార్ సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ సిద్ధాంతాలను యువతకు, విద్యార్థులకు వివరించేందుకే చేపట్టిన 'బాపుబాటలో.. సత్యశోధన' పాదయాత్ర బుధవారం హన్వాడకు చేరుకుంది. 100రోజుల్లో 1000కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా ప్రాథమిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఎంజేపీ గురుకులాలు, సల్లోనిపల్లి మండల పరిషత్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయా పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మహాత్మాగాంధీ ఆదర్శాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోదమ్మ, మాజీ ఎంపీపీ బాల్‌రాజు, ఏపీఎం సుదర్శన్, స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, కేజీబీవీ ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, బీసీటీఏ జిల్లా ప్రధానకార్యదర్శి రాఘవేందర్, మండల అధ్యక్షుడు మల్లేష్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఈఓ విజయ్‌కుమార్

శివాలయంలో 400 ఏళ్ల ఆంజనేయస్వామి విగ్రహం

కల్వకుర్తి: మండలంలోని ఎల్లికల్ గ్రామంలో ఉన్న శివాలయంలో 400 ఏళ్ల నాటి అతిపురాతన ఆంజనేయస్వామి విగ్రహం ఉందని పురావస్తు శాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి తెలిపారు. బుధవారం గ్రామంలో పర్యటించిన ఆయన దేవాలయంలో ఉన్న అతిపురాతన విగ్రహాలను పరిశీలించారు. గ్రామ శివారులో ఉన్న శిథిల శివాలయంలో నిధుల వేట కోసం తవ్వకాలు జరపటంతో చాలా విగ్రహాలు ధ్వంసమయ్యాయని ఆయన పేర్కొన్నారు. శివాలయంలో ఉన్న నంది విగ్రహాలను పదిలంగా ఉంచేందుకు గ్రామంలోని పీఠాలపై వాటిని నిలబెట్టాలని గ్రామస్తులకు సూచించారు. ఆరు అంగుళాల ఎత్తు, నాలుగు అంగుళాల వెడల్పుతో సున్నపు రాతితో చెక్కిన సూక్ష్మ ఆంజనేయ విగ్రహమని, అదే కొలతలతో వినాయకుడి విగ్రహం కూడా ఉందని తెలిపారు. విజయనగర కాలానికి చెందిన ఇలాంటి పురాతన విగ్రహాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆయన వెంట ముత్యాల్ రెడ్డి ఉన్నారు.



400 ఏళ్ల పురాతన విగ్రహాలతో శివనాగిరెడ్డి

క్లుప్తంగా

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి జైలు



మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడికి బుధవారం నారాయణపేట కోర్టు ఆరునెలల పాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. డీఎస్పీ లింగయ్య తెలిపిన వివరాలకు మేరకు.. కన్మనూర్‌కు చెందిన మాలే ఆంజనేయులు బాలికకు మాయమాటలు చెప్పి పని ఇప్పిస్తానని హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడి నుంచి నాందేడ్‌లో నాందేడ్ రైలులో నిజామాబాద్ వెళ్లారు. అక్కడ రైల్వే పోలీసులు వీరిన్ని పట్టుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు మరికల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మురళీ కిడ్నాప్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వాదనలు విన్న జడ్జి ఎండీ.ఉమర్ నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో చురుకుగా విధులు నిర్వహించిన కోర్టు పోలీస్ బాల ఈరప్ప, హన్మంతు, ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేష్‌ను డీఎస్పీ అభినందించారు.

అదనపు కట్నం కేసులో ముగ్గురికి జైలు శిక్ష

అచ్చంపేట రూరల్: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, అత్త, మరిదికి ఏడాది పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధిస్తూ నాగర్‌కర్నూల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి సబితా బుధవారం తీర్పునిచ్చారు. లైజన్ అధికారి వినయ్‌కుమార్, అచ్చంపేట కోర్టు కానిస్టేబుల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన సంధ్యబాయ్‌ని 2021లో అచ్చంపేటకు చెందిన నేనావత్ శివకుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన కొద్దిరోజులకు సంధ్యబాయ్‌ని భర్త శివకుమార్, అత్త రాజేశ్వరి, మరిది శ్రీకాంత్‌లు కలిసి అదనపు కట్నం కోసం ఆమెను వేధించారు. ఇనుప రాడుతో కొట్టగా ఆమెకు బలమైన గాయమైంది. 2022లో అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆ కేసు బుధవారం నాగర్‌కర్నూల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి సబితా ట్రయల్ జరిపి సంధ్యబాయ్‌ని అదనపు కట్నం కోసం వేధించి, ఇనుప రాడుతో కొట్టిన ముగ్గురు శివకుమార్, రాజేశ్వరి, శ్రీకాంత్‌లకు ఏడాది జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. 10వేల జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి

- జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా రగ్బీ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్–17 విభాగం బాలబాలికల రగ్బీ ఎంపికలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆమె మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మంది హాజరైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో చాంపియన్‌గా నిలిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, ఉమాపతిరెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫోన్లు గుర్తించడంలో సీఈఐఆర్ పోర్టల్ కీలకం

- 112 మంది బాధితులకు ఫోన్లు అందజేత

మహబూబ్‌నగర్ క్రైం: మొబైల్ ఫోన్లు తప్పిపోయినా లేదా దొంగలించబడిన సందర్భాల్లో తిరిగి ఫోన్లను గుర్తించడానికి సీఈఐఆర్ పోర్టల్ అనేది ఉపయోగపడుతుందని ఎస్పీ డి.జానకి అన్నారు. ఈపోర్టల్ ద్వారా గుర్తించిన 112 ఫోన్లను బుధవారం పరేడ్ మైదానంలో ఎస్పీ బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫోన్లు తప్పిపోతే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తిరిగి పొందేఅవకాశం ఉంటుందన్నారు. పోర్టల్‌లో ఎంటర్ చేసిన ఫోన్ వివరాలు ఇతర రాష్ట్రాల్లో, ఇతర నెట్‌వర్క్‌ల్లో ఉపయోగించకుండా బ్లాక్ చేస్తుందన్నారు. ప్రజలు సెల్ ఫోన్లు పోయినప్పుడు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు రిజిస్టర్ చేయాలన్నారు.



మొబైల్ ఫోన్లు అప్పగిస్తున్న ఎస్పీ డి.జానకి

జూరాలకు స్వల్పంగా వరద

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లోలు కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. మంగళవారం ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రం వరకు ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోలు 14వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 12,762 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 920 క్యూసెక్కులు, కుడి కాలువకు 730 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 14,483 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. బుధవారం ఎగువ నుంచి 11,510 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా రెండు గేట్లను తెరిచి 8,892 క్యూసెక్కులను దిగువకు వదిలినట్లు చెప్పారు.

శ్రీశైలంలో నీటిమట్టం 879.2 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 879.2అడుగుల వద్ద 183.8486 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 12,762 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 8,892 మొత్తం 21,654 క్యూసెక్కుల నీటిప్రవాహం శ్రీశైలం జలాశయానికి వస్తున్నాయి. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,304 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 15,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,575, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,090 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భకేంద్రంలో 8.800 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

కదిలిన అధికార యంత్రాంగం

- అనుమతిలేని బోర్ల పరిశీలన



జేసీబీతో తొలగిస్తున్న నీటి ట్యాంక్

జడ్చర్ల టౌన్: లోకాయుక్త ఆదేశాలతో జడ్చర్ల అధికార యంత్రాంగం కదిలింది. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ బ్రహ్మంగౌడ్ తన సిబ్బందితో కలసి గ్రామాల్లో అనుమతి లేని బోర్లను పరిశీలించారు. బోర్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్న నీటిట్యాంక్‌లను తొలగించారు. ఈసందర్భంగా నీటివ్యాపారం చేస్తున్న వారు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమకు సమయం ఇస్తే ట్యాంక్‌లను తామే తొలగించుకుంటామని వాదించారు. తమతోపాటు ప్యూరిఫైడ్ వాటర్ సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అలంపూర్: వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అలంపూర్ మండలం ర్యాలంపాడులో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ డీ భద్రు, డాక్టర్ మల్లయ్య, జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి సక్రియ నాయక్‌లు బుధవారం మొక్కజొన్న పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. గ్రామంలో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న పంట సాగులో కంకులు అధికంగా రావడానికి గల కారణాలను శాస్త్రవేత్తలు పరిశీలించి నమోదు చేసుకున్నారు. రైతులు పంట సాగులో అధిక దిగుబడి సాధించడానికి యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట సాగులో మెలుకువలు, సలహాలు సూచనలు చేశారు. వారితోపాటు వ్యవసాయ అధికారులు నాగార్జున రెడ్డి, విస్తరణ అధికారి నవీన్, రైతులు ఉన్నారు.

పురుగు మందు తాగిన మహిళ

గద్వాల క్రైం: కుటుంబ సభ్యులతో జరిగిన వివాదంతో మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగింది. ఈ ఘటన గద్వాల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పూడూర్ గ్రామానికి చెందిన సుజాతకు భర్త రాజుతో కుటుంబసభ్యుల విషయమై మంగళవారం రాత్రి వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆమె మనస్థాపం చెంది ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన బంధువులు చికిత్సనిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని తెలిపారు. ఈసంఘటనపై రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో చోరీ

మద్దూరు: పట్టణ శివారులోని వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం చోరీ జరిగింది. దొంగలు చోరీ సామగ్రిని అమ్మడానికి బస్సులో వెళ్తున్న క్రమంలో ప్రయాణికులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన శ్రీనివాస్, ఉసేనమ్మ దంపతులు వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో ఉన్న ఎంప్లీఫైర్, మైక్, పూజకు ఉపయోగించే ఇత్తడి, రాగి వస్తువులను అపహరించారు. ఇదే క్రమంలో గుడిని శుభ్రం చేయడానికి గురుస్వామి ఆలయానికి చేరుకొని చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. అదే రూట్‌లో వెళ్లే బస్సులో దొంగలు వెళ్తున్నట్లు ప్రజలు గుర్తించి వారిని పట్టుకొని కోయిల్‌కొండ పోలీసులకు అప్పగించారు. అక్కడి నుంచి దొంగలను, దొంగిలించిన సామగ్రిని మద్దూరుకు తీసుకొచ్చారు. గురుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా రైలు కిందపడి మరొకరు ఆత్మహత్య చేసుకున్నాడు. విధుల హాజరై గుండెపోటుతో ఇంకొకరు మరణించారు.

అంత్యక్రియలకు వెళ్లి వస్తూ...



కిష్టప్ప(ఫైల్)

మద్దూరు: బంధువుల అంత్యక్రియలకు వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన దేవరగట్టు దగ్గర బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొత్తపల్లి మండలంలోని పెద్దపూర్ గ్రామానికి చెందిన సంచారమోళ్ల కిష్టప్ప(48) మద్దూరు మండలంలో చింతల్‌దిన్నే గ్రామంలో బంధువు మృతిచెందడంతో బైక్‌పై అంత్యక్రియలకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో దేవరగట్టు తాండా దగ్గర మినీ టిప్పర్‌కు బైక్ ఢీకొనగా కిష్టప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని నారాయణపేట జిల్లా అసుపత్రికి తరలించారు. భార్య సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

రైలు కిందపడి వ్యక్తి..

గద్వాల క్రైం: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల పట్టణంలోని గజ్జెలమ్మ వీధికి చెందిన కుర్వ పరుశరాముడు(37) హమాలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నిరోజుల నుంచి అతడి కూతురి(మైనర్)ని జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరుతో వేధించేవాడు. ఈక్రమంలో యువకుడి పెద్దలతో మాట్లాడి మందలించినా అతడి తీరులో మార్పు రాలేదు. బంధువులతో పంచాయితీ జరిపించాడు. దీంతో ఆ యువకుడు కొన్ని రోజులు స్తబ్దుగా ఉన్నాడు. అమ్మాయికి త్వరలో వివాహం చేసేందుకు తండ్రి ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న యువకుడు వారి బంధువులను ఫోన్ ద్వారా బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన పరుశురాముడు సాయంత్రం సెకండ్ రైల్వేగేట్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈసంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విధులకు హాజరై...

దామరగిద్ద: ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉదయం విధులకు హాజరై గుండెపోటుతో మృతిచెందారు. కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. కార్యాలయానికి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యారు. స్థానిక పీహెచ్‌సీకి వెళ్లగా అక్కడ వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఎంపీడీఓ సొంత వాహనంలో నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.